క్లుప్తంగా

మురుగు సమస్య లేకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: తెనాలిలో మురుగు సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 16వ వార్డులో బుధవారం ఆమె పర్యటించారు. మురుగు కాల్వలు బాగు చేయటం లేదని పలువురు స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేయటంతో వాటిని ఎందుకు ప్రతిరోజు బాగు చేయటం లేదని ప్రశ్నించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. ఆమె వెంట కౌన్సిలర్ దాసరి వసంతరావు, ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఏఈ సూరిబాబు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో పారుదల ఉండే విధంగా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 14,16 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

కెఎస్ఎం స్కూల్లో కాంప్లెక్స్ సమావేశం



తెనాలిఅర్బన్: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. సెప్టెంబర్ నెలలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. కాంప్లెక్స్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అందరు అమలు చేయాలని రిసోర్స్ పర్సన్ సోమరౌతు శ్రీనివాసరావు సూచించారు. సమావేశంలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులు రాజీవ్ నాయక్, మండే శ్రీనివాస్, పుట్టా జనార్దనరావు, కోడూరు అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- తూములూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఆరంభం

తూములూరు(తెనాలి): అన్నదాతలకు మద్దతు ధరను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వెల్లడించారు. కొల్లిపర మండల గ్రామం తూములూరులో బుధవారం సాయంత్రం రైతు సేవాకేంద్రం ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజను 2024–25 ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజన సింహా, అసిస్టెంట్ కలెక్టర్ పోవర్ స్వప్నిల్ జగన్నాథ్‌తో కలసి ప్రారంభించారు. గ్రామంలోని మారెడ్డి సుబ్బారెడ్డి ట్రస్ట్ కల్యాణ మండపంలో ధాన్యం కొనుగోలు ప్రారంభోత్సవ సభలో రైతుల నుద్దేశించి మాట్లాడారు. రైతు శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం జిల్లాలోనే తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తూములూరులో ప్రారంభించినట్లు చెప్పారు. జిల్లాలో 156 రైతుసేవా కేంద్రాలను 45 క్లస్టర్లుగా విభజించినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజనుకు జిల్లాలో 3.4 మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ–క్రాప్‌లో నమోదు చేసుకుని ఈకేవైసీ చేసుకున్న రైతులనుంచి మాత్రమే రైతుసేవకేంద్రాలు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం 75 కే.జీల ఏ–గ్రేడ్ ధాన్యంకు రూ.1740, సాధారణ రకానికి రూ.1725 చెల్లిస్తుందని చెప్పారు.

రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకు వచ్చేటప్పుడు 17 శాతం తేమ ఉండాలని, అదనంగా ఐదు శాతం వరకు శాతానికి కిలో చొప్పున తీసుకోవటం జరుగుతుందన్నారు. అధిక తేమ ఉన్న ధాన్యాన్ని రైతులు ఆరబెట్టి తీసుకురావాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాలకు నగదు జమ జరుగుతుందని చెప్పారు. రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకొని నష్టపోవద్దని హితవు పలికారు. జిల్లాలో 15 ధాన్యం మిల్లులు డబ్బులు చెల్లించి ఉన్నాయని, వాటిని పోర్టల్‌లోకి తీసుకొచ్చామని చెబుతూ, రైతులు తమకు ఇష్టమైన మిల్లుకు ధాన్యాన్ని తరలించవచ్చని కోరారు.



ధాన్యంలో తేమశాతం పరిశీలిస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

మద్దతు ధర కంటే ఎవరు తక్కువ ధరకు అమ్మవద్దని ఈ–క్రాప్ చేసిన రైతు తమ ధాన్యాన్ని అమ్మేటప్పుడు ఒక రోజు ముందుగా రైతు సేవ కేంద్రంలో నమోదు చేసుకుంటే సిబ్బంది పంట దగ్గరకు వెళ్ళి తేమ శాతాన్ని పరిశీలించి ధాన్యం కొనుగోలు తేదీని నిర్ణయిస్తారన్నారు. తేమ శాతం 17 ఉంటే వెంటనే కొనుగోలు చేస్తారని, అంతకంటే ఎక్కువ ఉంటే రెండు రోజులు ఆరబెట్టి కొనుగోలు చేస్తారని తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు మద్దతు ధరకంటే అధికంగా ఇస్తానంటే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెం.1967, జిల్లా కంట్రోల్ రూంకు 7702806804 తెలియజేయాలన్నారు.

సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సేవ కేంద్రాలతో కొనుగోలు చేసిన ధాన్యానికి రైతుల ఆధార్ లింక్‌తో వున్న బ్యాంక్ ఖాతాలకు నేరుగా నగదు చేరుతుందని చెప్పారు. గోదావరి జిల్లాల్లో నెల రోజుల ముందే ధాన్యం కొనుగోలు చేసి రూ.500 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేసిందన్నారు. జిల్లాలో మార్కెటింగ్, కో ఆపరేటివ్ సొసైటి సహకారంతో పౌర సరఫరాల శాఖ , రెవెన్యూ యంత్రాంగం ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. ధాన్యం పొలం నుంచి వాహనంలో ఎగుమతి చేసిన దగ్గరి నుంచి రైస్ మిల్లు వద్ద దిగుమతి అయ్యేవరకు జీపీఎస్‌తో ట్రాక్ జరుగుతుందన్నారు. రైతు గోనె సంచులు, హమాలీలు, రవాణా ఏర్పాటు చేసుకుంటే, ప్రభుత్వం లెక్కల ప్రకారం ఆ డబ్బులు నేరుగా రైతు ఖాతాలోకి ధాన్యం సొమ్ముతో సహా చెల్లిస్తామన్నారు.

తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా మాట్లాడుతూ ధాన్యం విక్రయంలో ప్రభుత్వం నిబంధనలను సులభతరం చేసిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం రైతు సేవ కేంద్రంలో అమ్మకానికి సిద్ధంగా వున్న ధాన్యం బస్తాల తూకాన్ని జిల్లా కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. అనంతరం ధాన్యాన్ని మిల్లులకు పంపడానికి ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ను రైతు కుటుంబానికి చెందిన బాలుడి చేత రిబ్బన్ కత్తిరింపజేసి మిల్లులకు పంపించటాన్ని ఆరంభించారు. ధాన్యం కొనుగోలు, బీమా కరపత్రాలు, పోస్టరును ఆవిష్కరించారు.

జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు , జిల్లా పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కోమలి పద్మ, జీడీసీఎంఎస్ బ్రాంచ్ మేనేజర్ హరగోపాల్ , ఏడీఏ తెనాలి ఉషారాణి , వంగా సాంబిరెడ్డి , తూములురు గ్రామ సర్పంచ్ అరుణా భాయ్ , ఎంపీపీ భీమవరపు పద్మావతి, టీడీపి మండల అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్య నాయుడు, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణాన్ని అభివృద్ధి చేసే క్రమంలో రోడ్ల విస్తరణతో పాటు మార్కెట్ ప్రాంతంలో అక్రమణలు తొలగించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌తో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణం విస్తరిస్తూ ఉందని, ప్రస్తుతం రెండు లక్షల జనాభా నివశిస్తున్నట్లు చెప్పారు. వారికి అనుగుణంగా పట్టణంలో మౌళిక వసతుల కల్పన కోసం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు శివాజీ చౌక్, స్వరాజ్ టాకీస్ సెంటర్‌లలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. అలాగే మున్సిపల్ మార్కెట్ వద్ద కొందరు వ్యాపారులు దుకాణాల బయటకు వచ్చి వ్యాపారాలు చేసుకుంటున్నారని, మరికొందరు రోడ్లపై ఆకుకూరలు, కూరగాయాల వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. అలాంటి వారితో సమావేశం నిర్వహించి వారికి కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని సూచించటం జరిగిందన్నారు. స్ట్రీట్ వెండర్స్ కోసం ప్రత్యేక స్థలాన్ని చూస్తున్నామని, త్వరలో వారికి అక్కడ వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఇస్తామన్నారు. అప్పటి వరకు కొంత సంయవనం పాటించాలన్నారు. ఒకరిద్దరు వ్యాపారులు దీనిపై రాద్ధాంతం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పట్టణాభివృద్ధికి అందరు సహకరించాలని కోరారు. సమావేశంలో ఆరోగ్యాధికారిణీ డాక్టర్ కె హెలెన్ నిర్మల, రెవిన్యూ అధికారి రాంప్రసాద్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

ఏఎస్ఎన్‌లో రక్తదాన శిబిరం

తెనాలి: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్, ముంబయి పిలుపు ప్రకారం 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. బిఫార్మసీ, ఫార్మా–డీ విద్యార్థులు రక్తదానం చేశారు. ఐపీఏ–ఎస్ఎఫ్, ఏపీటీఐ–ఏపీ రాష్ట్రశాఖ, ఎన్ఎస్ఎస్ 1,2 విభాగాలు, యూత్ రెడ్ క్రాస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజరు రామచంద్రరావు సహకారంతో ఏర్పాటైన రక్తదాన శిబిరంలో మండల తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, తెనాలి చైర్‌పర్సన్ ముమ్మనేని భానుమతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఒకరి రక్తదానం కొందరి జీవితాల్లో వెలుగు నింపగలదన్న సత్యాన్ని మిగిలినవారికి స్ఫూర్తి కలిగేలా విద్యార్థులు రక్తదానం చేయాలని ఏపీటీఐ ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. ఆరోగ్యవంతమైన మనిషి ఆర్నెల్లకు ఒకసారి రక్తదానం చేయడం ద్వారా శరీరంలో కొత్త రక్తం తయారువుతుందని వివరించారు. విద్యతో పాటు విద్యార్థులు సేవాభావం అలవరచుకోవాలన్న సంకల్పాన్ని తెలియజెప్పేందుకు రక్తదాన శిబిరాలు, ఆరోగ్య అవగాహనా సదస్సులు వంటి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెనాలి ఉపాధ్యక్షుడు కూడా అయిన మండల తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ డి.నాగార్జునరెడ్డి కూడా విద్యార్థులతోపాటు రక్తదానం చేశారు. ఫార్మసీ విద్యార్థులు 30 యూనిట్ల విలువైన రక్తాన్ని అందించారని యూత్ రెడ్ క్రాస్ కన్వీనర్ డాక్టర్ టి.లక్ష్మీదుర్గ తెలిపారు. మూడు లేదా నాలుగుసార్లు కంటే ఎక్కువ రక్తదానం చేసిన విద్యార్థులను కేవీ గోపాలకృష్ణ అభినందించారు. యూత్ రెడ్ క్రాస్ ఏ ఎస్ ఎన్ కన్వీనర్ డాక్టర్ టీ.లక్ష్మీదుర్గ, ఐపీఏ–ఎస్ఎఫ్ మెంటర్స్, జి.నందగోపాలకృష్ణ, పి.భార్గవి, ఐపీఎఎస్ఎఫ్–ఏఎస్ఎన్ అధ్యక్షుడు ఎస్.సునీల్, ఏపీటీఐ–ఏపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు/ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్. కె.వెంకట రమణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.జ్యోతిబసు, కె.కళ్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ

మార్కెట్ సెంటర్లో చిరువ్యాపారుల నిరసన

అమ్మే సరుకులను రోడ్డుపై పోసి నిరసన

తెనాలి: కూరగాయల మార్కెట్ సెంటర్లో మెయిన్‌రోడ్డులోని వ్యాపారాలు చేసుకుంటున్న తమను నిరోధించటంపై చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ట్రాఫిక్ అంతరాయం పేరిట తమను ఖాళీచేయించటంపై తోపుడుబళ్లు, బుట్టల్లో పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు విక్రయించుకుని జీవించే వ్యాపారులు బుధవారం నిరసన తెలియజేశారు. అరటిపండ్లు, ఆకుకూరలు రోడ్డుపై పారబోసి ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. గత నాలుగు దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, తమ వ్యాపారాలకు ఏమాత్రం అడ్డుచెప్పలేదని గుర్తుచేశారు. రోడ్డుపక్కన పండ్లు, కూరగాయలు అమ్ముకుని జీవించే తమ పొట్టగొట్టటం ఏమిటని, తమ బాధలు అధికారులకు ఏం తెలుసునని ప్రశ్నించారు. గతంలో తమకు ఐడీ కార్డులు కూడా ఇచ్చినట్టు చెప్పారు. అధికారుల చర్య కారణంగా 50 కుటుంబాలకు ఆదరువు పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు.



నిరసన వ్యక్తంచేస్తున్న చిరువ్యాపారులు

బడి బయట పిల్లలు కనబడితే 1098కు ఫోన్ చేయాలి

తెనాలిరూరల్: ఐసీడీఎస్ తెనాలి ప్రాజెక్ట్ అధ్వర్యంలో బాలల వారోత్సవాల్లో భాగంగా బాలల హక్కులు, చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్ 1098పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. మండలంలోని కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ జరిగిన ఈ కార్యక్రమానికి పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎం.బాలనాగయ్య నాయక్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా గుంటూరు రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ టీం మెంబర్ వాకా లక్ష్మణ్ నందన్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కొలకలూరు సెక్టార్ సూపర్‌వైజర్ హిమబిందు పాల్గొన్నారు. లక్ష్మణ్ నందన్ మాట్లాడుతూ బాలల హక్కులు, చైల్డ్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 ఆవశ్యకతను తెలియజేశారు. అంతేకాకుండా బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాలని, అక్షరాస్యత శాతాన్ని మరింతగా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బడిని వీడిన పిల్లలు, భిక్షాటనలో ఉన్న పిల్లలు కనపడితే 1098కు సమాచారం అందించాలని సూచించారు. అటువంటి వారిని స్కూల్ లో తిరిగి చేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరగకుండా చూడాలని, ఎక్కడన్నా జరుగుతున్న బాలల, శిశు సంక్షేమ లేదా రెవిన్యూ శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని చెప్పారు. బాలికలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా ఐసీడీఎస్ లేదా పాఠశాలలో టీచర్లకు తెలియజేయాలని కోరారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలికల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో క్రాఫ్ట్ ఎన్జీవో తెనాలి ప్రాంత ప్రతినిధి రజిని గారు, గ్రామ మహిళా పోలీసులు ప్రగతి, మల్లిక, కొలకలూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 1098 స్టోర్‌ను ఆవిష్కరించారు.

కుంచవరంలో వారాహి దేవాలయ శంకుస్థాపన

కుంచవరం(తెనాలి): తెనాలికి చెందిన స్వచ్ఛంద సేవాసంస్థ 'పోస్ట్' ఆధ్వర్యంలో తెనాలి సమీపంలోని కొల్లిపర మండల గ్రామం కుంచవరంలో గల ప్రాంగణంలో శ్రీవారాహి అమ్మవారి ఆలయ నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. శైవాగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయ శర్మ ప్రసాద్ శివాచార్య, శిష్యబృందం వైభవంగా ఈ వేడుకను జరిపించారు. తెనాలి శ్రీవిద్యాపీఠం ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ), శ్రీవరణాగతి గోష్ఠి వ్యవస్థాపకుడు నరేంద్ర రామాజనుదాసస్వామి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. వారాహి అమ్మవారి ప్రాముఖ్యత, పూజావిధానం గురించి ప్రజ్ఞానంద సరస్వతి వివరించారు. దైవత్వం, మానవులు ఏవిధంగా జీవించాలనేది నరేంద్ర రామాజనుదాసస్వామి వెల్లడించారు. ఇక్కడి శ్రీవారాహి అమ్మవారి దేవస్థానం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖమైనదిగా వెలుగొందాలన్న ఆకాంక్షను వ్యక్తంఏశారు. కాకతీయ సహకార బ్యాంక్ చైర్మన్ డీఎల్ కాంతారావు, జంపని చక్కెర ఫ్యాక్టరీ మాజీ చైర్మన్ నన్నపనేని లింగారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, గుంటూరు నుండి ఉగ్గిరాల సీతారామయ్య, శ్రీను, శ్రీనివాస రామారావు, గ్రామపెద్దలు సుబ్బారావు, శంకరరావు, తెనాలి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తోటకూర వెంకటరమణారావు, హరిదాసు గౌరీశంకర్, మామిడిబత్తుల సుబ్రహ్మణ్యం, వల్లెం మురళి, శిల్పి శ్రీనివాస్, చల్లా పుల్లారావు, దంతాల కిరణ్కుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ తన్నీరు శ్రీనివాసబాబు–నాగమల్లేశ్వరిదేవి దంపతులు పర్యవేక్షించారు.



శంకుస్థాపన పూజల్లో స్వామీజీలు నిర్వాహకులు

దాడి ఘటనపై కేసు నమోదు

తెనాలిరూరల్: తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడంటూ వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన వెంకట నాగకృష్ణప్రసాద్‌ను నందులపేటకు చెందిన సాయి, అతని బంధువు పిలిపించి దాడి చేశారు. తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నాడని ఆరోపించారు. గాయపడిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెదరావూరులో 'పొలం పిలుస్తోంది'

తెనాలిరూరల్: మండలంలోని పెదరావూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారులు బుధవారం న్విహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లామ్ ఫామ్ శాస్త్రవేత్త డాక్టర్ రత్నం పాల్గొన్నారు. మొక్కజొన్న జొన్న విత్తనాలు వాటి ప్రాముఖ్యత, సేంద్రియ కార్బన్ భూమిలో ఏవిధంగా ఉండాలో వివరించారు. నీటి యాజమాన్య పద్ధతులను తెలిపారు. మండల వ్యవసాయ అధికారి జి. ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ వచ్చే మొక్కజొన్న, జొన్న, మినుము, పెసర పంటలకు రైతులు డిసెంబర్ 15వ తేదీ లోపల ఇన్సూరెన్స్ ప్రీమియంను మీ సేవలో/ కామన్ సర్వీస్ సెంటర్‌లో చెల్లించి ఆ రసీదును రైతుసేవా కేంద్రాల సిబ్బందికి చూపించాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేశామని, ఎవరైతే ఈ–పంట నమోదు చేయించుకున్నారో ప్రభుత్వానికి అమ్మేందుకు రైతు సేవా కేంద్రాల సిబ్బంది ద్వారా సివిల్ సప్లై వారి ఆధ్వర్యంలో కొనుగోలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదరావూరు సర్పంచ్ కాకి రమాదేవి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సహకార వారోత్సవాలు



సహకార గీతాన్ని ఆలపిస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రారు విజయలక్ష్మి

తెనాలి: స్థానిక కొత్తపేటలోని కాకతీయ కో–ఆపరేటివ్ సొసైటీలో బుధవారం సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ సమావేశపు హాలులో జరిగిన ఈ వేడుకలకు చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత హించారు. సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రారు సీహెచ్ విజయలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సహకార వారోత్సవాల ప్రాధాన్యతను తెలియజేశారు. సహకార ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ ఇన్‌స్పెక్టర్ జడా సురేష్, వైస్‌చైర్మన్ గ్రంధి చంద్రమౌళీశ్వరరావు, డైరెక్టర్లు వీవీవీ ప్రసాద్, పీఎస్సార్ బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు. తొలుత చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో దావులూరి చక్రధర్, కఠారి వాసుదేవనాయుడు, సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, సభ్యులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



కళ్యాణం నిర్వహిస్తున్న పండితులు

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీశ్రీనివాస కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో సాయంత్రం నుంచి శ్రీస్వామి వారికి విశేషపూజలు చేశారు. అనంతరం నృత్యగురువు ఎ.వెంకటలక్ష్మి పర్యవేక్షణలో శిష్యబృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించింది. అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన అనంతరం శ్రీశ్రీనివాస కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. తదుపరి తీర్థప్రసాద వితరణ ఉంటుందన్నారు. క్యాపిటల్ హాస్పటల్స్ ఎండీ మన్నే హరీష్, శశి గ్రూప్ అధినేత వుప్పల వరదరాజులు, వేమూరి విజయభాస్కర్, డాక్టర్ నారాయణం వేణుగోపాల్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. కల్యాణ శ్రీనివాసుని ఆలయం నిర్మించాలన్న తలంపును నిర్వాహ కులు వ్యక్తం చేశారు. ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వ్యవస్థాపక చైర్మన్ ఆర్‌వీ కిరణ్‌కుమార్, సభ్యులు గుడివాడ బాలకృష్ణ, జంధ్యం రామారావు, మూర్తి వెంకటేశ్వరరావు, మదుపల్లి చంద్రశేఖర్, కట్టమూరి రమణకుమార్, మాజేటి వెంకటేష్, రొంపిచర్ల సురేష్, బచ్చు లీలాప్రసాదరావు, రమణకుమార్ పర్యవేక్షించారు.

ధాన్యం కొనుగోళ్ల పై హర్షం

తెనాలి: మార్కెట్‌లో ధాన్యానికి ధర లేని ప్రస్తుత తరుణంలో రైతుల విజ్ఞప్తి మేరకు రాష్ట్రప్రభుత్వం కొల్లిపర మండలం తూములూరులో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటం హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి పేర్కొన్నారు. కేవలం తూములూరులోనే కాకుండా మిగతా అవసరమైన చోట్ల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరారు. తమ వినతికి స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినందుకు తెనాలి సబ్‌కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

తెనాలి: పట్టణ పరిసరాల్లోని శాఖా గ్రంథాలయాల్లో గత వారంరోజులుగా జరిగిన 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు బుధవారంతో ముగిశాయి. స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఏర్పాటైన ముగింపు సభకు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. గత వారంరోజులుగా నిర్వహించిన వివిధ ప్రతిభా పోటీల్లో విజేతలైన పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆలపాటి కళాపీఠం అధ్యక్షుడు పావులూరి శ్రీనివాసరావు, విశ్రాంత గ్రంథపాలకుడు మొవ్వా సుబ్బారావు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు డీవీఆర్ ప్రసాద్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారిణి రమాదేవి పర్యవేక్షించారు.

మహిళా బాలల గ్రంథాలయంలో...

స్థానిక కొత్తపేటలోని మహిళా బాలల గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ముగింపుసభకు మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత వారం రోజులుగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్, డిబేట్, రన్నింగ్, లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. లైబ్రేరియన్ అంజలి, న్యాయవాది వెలినేని రాఘవయ్య, ఎస్‌బీఐ విశ్రాంత అధికారి లక్కరాజు సాయి, నాగేంద్రరావు, అందే బాలచంద్రమౌళి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు,

పెదరావూరులో...

రూరల్ మండల గ్రామం పెదరావూరులోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ శ్రీమతి కాకి రమాదేవి పాల్గొన్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్మన్ మారౌతు సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి పి.దానయ్య, జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు పి కృష్ణ, కే.చంద్రమౌళి, ఎం.సుబ్బారావు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సంగంజాగర్లమూడిలో...

రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ వారోత్సవాల ముగింపు బుధవారం ఘనంగా జరిపారు. గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా గ్రామసర్పంచ్ పాలడుగు జయనాగలక్ష్మి,ప్రధానోపాధ్యాయుడు ఎ.శివరామకృష్ణ,అనంతశయనం హాజరయ్యారు.

కొలకలూరులో...

రూరల్ మండలం కొలకలూరులో జాతీయ వారోత్సవాల ముగింపు సభలో పంచాయతీ కార్యదర్శి జీవీఎస్ఎస్ ప్రసాద్, నవచైతన్య స్కూల్ కరస్పాండెంట్ దూళ్ల నరేంద్రకుమార్, గ్రామపెద్దలు పి.నారాయణరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు తన్నీరు సుబ్బారావు. ఉపాధ్యాయుడు ఆదినారాయణ, శ్రీవర్ధిని స్కూల్ కరస్పాండెంట్ రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సింగరాణి, జ్యోతి, పద్మరాజు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. గ్రంథాలయాధికారి కడియాల సుజాత పర్యవేక్షించారు.

నందివెలుగులో...

రూరల్ మండల గ్రామం నందివెలుగులో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగిశాయి. ముగింపు సభకు విశ్రాంత ఈవో పారేపల్లి భార్గవరావు, దుర్గాప్రసాద్, సుబ్బారావు, విక్టోరియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తెనాలి శాఖాగ్రంథాలయంలో విజేతలతో అతిథులు

చేతి పంపు ఏర్పాటులో వివాదం

- ఆందోళన చేసిన మహిళలు
- పోలీసుల జోక్యంతో ముగిసిన వివాదం



సంఘటనా స్థలంలో మహిళలు

తెనాలిఅర్బన్: చేతిపంపు ఏర్పాటు చేసే విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఓ చికెన్ షాపు వ్యాపారి దానిని వేయడానికి వీలులేదని అడ్డుకోవటంతో మహిళలు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న త్రీటౌన్ ఎస్సై ప్రకాశరావు అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి పంపును వేయించారు. వివరాలలోకి వెళ్తే.. చెంచుపేటలోని ఈద్గా బయట మున్సిపాలిటీ సహకారంతో చేతి పంపును ఏర్పాటు చేయించే పనిని బుధవారం ప్రారంభించారు. దీనిని గమనించిన చికెన్ షాపు నిర్వాహకుడు బిలాల్ దానిని అడ్డుకున్నారు. ఇక్కడ పంపు ఏర్పాటు చేయటం వల్ల నీరు నిలచి అపరిశుభ్రంగా మారుతుందని ఆరోపించారు. దీంతో మహిళలు రోడ్డుపై కూర్చుని ఆందోళనకు దిగారు. పంపు ఏర్పాటు వేయాల్సిందేనని పట్టుబట్టారు.